క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాకినాడ రూరల్: కాకినాడ సెక్షన్ మాధవపట్నం ఫీడర్ మరమ్మతుల వల్ల గైగోలుపాడు సబ్ స్టేషన్ 33/11కేవీ ఉప కేంద్రం పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఉదయ్‌భాస్కర్ తెలియజేశారు. ఈ మరమ్మతుల వల్ల సర్పవరం, పనసపాడు రోడ్డు, భావనారాయణపురం, పోస్టల్ కాలనీ, ఆటోనగర్, ఎఫ్‌సీఐ కాలనీ 1, 2, 3వ రోడ్లు, శుభానికేతన్ ప్రాంతం, న్యూ గైగోలుపాడు ఏరియా, సోమాలమ్మ దేవాలయం ప్రాంతం, దేవీ నగర్, రామ్‌నగర్, అంబేడ్కర్ కాలనీ, జ్యువెల్ సిటీ, సర్పవరం పూల మార్కెట్, గాంధీనగర్, మహారాష్ట్ర బ్యాంక్, ముద్దన వారి వీధి, ట్రస్ట్ ఆస్పత్రి ఏరియా, స్పెన్సర్స్ వెనుక వైపు, నాగవనం, ఆంధ్రాబ్యాంక్ కాలనీ, పైడా వారి వీధి, ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ, లలితా నగర్, ఎస్వీ రంగారావు విగ్రహం వెనక వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

పీఎన్‌బీ సేవలు మరువలేనివి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణరాజు

బోట్‌క్లబ్: పంజాబ్ నేషనల్ బ్యాంకు అందిస్తున్న సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్సీ, చైతన్య విద్యాసంస్థల అధినేత కేవీవీ సత్యనారాయణరాజు అన్నారు. స్థానిక టౌన్‌హాల్‌లో ఆ బ్యాంకు ఏర్పాటు చేసిన సూక్ష్మ, మధ్య తరహా సంస్థల రుణ అవగాహన సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బ్యాంకు చీఫ్ మేనేజర్ రత్మశర్మ, ఏజీఎం సునీల్‌కుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూక్ష్మ, చిన్న మధ్య తరగతి పరిశ్రమలకు ఇచ్చే రాయితీలు, వారి వ్యాపారులు ఇచ్చే ప్రాధాన్యతను వివరించారు. తమ బ్యాంకు వ్యాపారులకు అందించే రుణాలు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు వివిధ శాఖాధికారులు మురళీకృష్ణ, ప్రభాకర్, ఉదయ్, రమేష్, రాజేష్, దాస్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ



బీచ్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ సిటీ: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా నగరపాలక సంస్థ కమిషనర్ భావన గురువారం తెల్లవారుజాము నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించారు. దీనిలో భాగంగా వివేకానంద పార్కు రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనుల నిర్వహణను తనిఖీ చేశారు. రోడ్లు, డ్రైన్ల పరిశుభ్రత, చెత్త సేకరణ వంటి విషయాలపై ఆరా తీశారు. పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

కాకినాడ బీచ్ సందర్శన

సాగర తీరాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా మార్చేందుకు చేపడుతున్న పనులను గురువారం కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన పరిశీలించారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఎస్ఈ కామేశ్వరరావు, ఎంఈ మత్స్యరాజు, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, డీఈలు, ఏఈలు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి రూ.లక్ష ఆర్థిక సాయం



వైద్య విద్యార్థి ఆకాశ్‌కు సాయం అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

బాలాజీచెరువు: పూర్వ విద్యార్థులందరూ కలిసి ఏర్పాటు చేసుకున్న రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్–1978 ద్వారా కోటి రూపాయల వరకూ సేవా కార్యక్రమాలు నిర్వహించామని ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. దేవాలయం వీధిలో గల కార్యాలయంలో గురువారం ట్రస్ట్ ద్వారా వైద్య విద్యార్థి మల్లాడి ఆకాష్‌కు రూ.లక్ష ఆర్థిక సహాయం చేశారు. గత మూడేళ్లుగా ఏడాదికి రూ.లక్ష చొప్పున ఇచ్చామని ఆఖరి ఏడాది అందజేశామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి కళ్యాణి, కోశాధికారి జగన్నాథరావు, వేదుల మధు, శారద, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎనిమిది మద్యం దుకాణాలపై కేసులు

కాకినాడ క్రైం: నిబంధనలు ఉల్లంఘించిన మద్యం దుకాణదారులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. జిల్లా అదనపు ఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ కాకినాడ నగరంలో గడచిన రెండు రోజుల్లో రాత్రి వేళల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో నిబంధనలు అతిక్రమించి రాత్రి 10 గంటల తర్వాత మద్యం వ్యాపారాలు చేస్తున్న వారిని గుర్తించారు. ఈ నేపథ్యంలో కాకినాడ వన్ టౌన్ పరిధిలో 4 దుకాణాలు, త్రీ టౌన్ పరిధిలో రెండు, సర్పవరం పరిధిలో రెండు దుకాణాలు మొత్తం 8 మద్యం దుకాణాలపై కేసులు నమోదు చేశారు.

కొరత కొందరికే!

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కోర్టు ఫీ స్టాంపులకు ఇబ్బంది
- ఏడాది కాలంగా ఇదే పరిస్థితి
- ప్రైవేటు వ్యక్తుల చేతిలో ఇబ్బడి ముబ్బడిగా లభ్యం
- అధిక ధర వెచ్చించి కొనుగోళ్లు
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది, కక్షిదారులు

కాకినాడ లీగల్: కోర్టుల్లో ఏ పత్రాలు పొందాలన్నా, కేసు దాఖలు చేసే ప్రతి పిటిషన్‌పై కోర్టు ఫీ స్టాంపులు కావాలి. అవి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లభించకపోవడంతో అటు కక్షిదారులు, ఇటు న్యాయవాదులు నానా ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సుమారు ఏడాది కాలం నుంచి కోర్టు ఫీ స్టాంప్‌లు లేవు. ఈ స్టాంపులు రూ.1, రూ.2, రూ.5, రూ.10, రూ.20 ముఖ విలువ కలిగి ఉంటాయి. జిల్లాలో కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కోర్టు స్టాంపులు లభిస్తున్నాయి. కాకినాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపుల పరిస్థితిపై సబ్ రిజిస్ట్రార్లు గతంలోనే జిల్లా అధికారులకు నివేదికలు పంపించారు. అయితే కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇవి అందుబాటులో ఉన్నప్పటికీ కొరత ఉన్నచోటుకు జిల్లా అధికారులు వాటిని తీసుకురావడంలో చొరవ చూపకపోవడంతో స్థానికంగా ఈ పరిస్థితి ఏర్పడింది.

అధిక ధరలకు విక్రయం

స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కోర్టు ఫీ స్టాంపులు లేకపోడంతో కొందరు ప్రైవేటు వ్యక్తులు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణ సమీపంలో కోర్టు వద్దకి వచ్చి కోర్టు ఫీజు స్టాంపులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. న్యాయవాదులు, కక్షిదారులు గత్యంతరం లేని పరిస్థితుల్లో అధిక సొమ్మును చెల్లించి వాటిని కొనుగోలు చేస్తున్నారు.

కోర్టు ఫీ స్టాంపుల ప్రాధాన్యం

కోర్టు వ్యవహారాల్లో స్టాంపుల పాత్ర చాలా కీలకం. నిందితుడు కోర్టుకు హాజరు కాకపోతే పిటిషన్‌పై స్టాంప్ అంటించాలి. అలాగే జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నిందితులు బెయిల్‌పై విడుదల కావాలంటే పిటిషన్‌కు స్టాంపు అంటించాలి. కోర్టుల నుంచి ఏ పత్రాలు కావాలన్నా స్టాంపులు లేకపోతే కోర్టు పిటిషన్లను స్వీకరించదు. కోర్టులో దాఖలైన పత్రాలను సర్టిఫికెట్ కాపీలుగా తీసుకోవాలన్నా స్టాంప్‌లు ఉంటేనే సిబ్బంది న్యాయవాదులకు సర్టిఫికెట్ కాపీలు ఇస్తారు.



కోర్టు ఫీ స్టాంపులు

స్టాంపులు విడుదల చేయాలి



కోర్టు ఫీ స్టాంపులు లేక ఇబ్బందిపడుతున్న విషయాన్ని జిల్లా అధికారులకు ఎన్నిసార్లు తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. ఈ విషయంపై స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రికి, ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీకి కోర్టు ఫీ స్టాంప్‌లు వెంటనే విడుదల చేయాలని లేఖలు పంపించాము. అధికారులు స్పందించి వెంటనే కోర్టు ఫీజుస్టాంపులు అందుబాటులో ఉంచాలి.

ముత్తింటి విశ్వేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కాకినాడ

వ్యవహారాలు స్తంభించిపోతున్నాయి



కోర్టులో విచారణ జరిగిన సాక్షులకు సంబంధించి సర్టిఫైడ్ కాపీలు తీసుకోవాలన్నా కోర్టు ఫీ స్టాంపులు కావాలి. అవి లేకపోవడంతో కోర్టుతో ముడిపడి ఉన్న ప్రతి అంశం స్తంభించిపోతోంది. దాంతో ఇబ్బందులు పడుతున్నాం. కక్షిదారుడికి సమాధానం చెప్పలేని పరిస్థితి ఏర్పడుతోంది.

వీవీవీఎస్ఎల్ కిరణ్, న్యాయవాది, కాకినాడ

స్టాంపులు లేక అవస్థలు



వివాహ రిజిస్ట్రేషన్లు, సమాచార హక్కు చట్టం కోసం , ఇతర అంశాలకు కోర్టు ఫీ స్టాంపులు ఎంతో అవసరం. కోర్టు ఫీ స్టాంపులు లేకపోవడంతో ఎంతో ఇబ్బంది పడుతున్నాం.

బి.వెంకట్‌కుమార్, న్యాయవాది గుమస్తా, కాకినాడ

మేల్ నర్సుపై విచారణకు ఆదేశం

- బ్లాంక్ పేపర్లపై సంతకాలు పెట్టించడంపై కలెక్టర్ సీరియస్
- వరుస ఫిర్యాదులు, ఆరోపణలతో చర్యలకు రంగం సిద్ధం
- కలెక్టర్ ఆదేశాలలో కమిటీ నియామకం

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో కాంట్రాక్టు విధానంలో మేల్ నర్సుగా పనిచేస్తున్న పోలాబత్తిన శ్రీనివాసరావుపై విచారణకు ఆదేశిస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం రాత్రి జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, రేడియేషన్ ఆంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసన్, ఆర్ఎంపీ ఏడీ శ్రీనివాస్‌లు విచారణాధికారులుగా, సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఛైర్మన్‌గా కమిటీ ఏర్పాటు కాగా గురువారం విచారణ ప్రారంభించారు. కొద్ది రోజుల క్రితం శ్రీనివాసరావు ఖాళీ పత్రాలపై సుమారు 60 మంది స్టాఫ్ నర్సులతో సంతకాలు చేయించుకున్నాడు. ఎందుకని వారు ప్రశ్నిస్తే నర్సుల సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించేందుకంటూ నమ్మబలికాడు. అధికారులు ఈ విషయంపై పరిశీలించగా నర్సులను తప్పుదోవ పట్టించాడని, తనకు గిట్టని సహోద్యోగులపై ఉన్న వైషమ్యాలతో, వారికి వ్యతిరేకంగా కుట్ర పన్ని సంతకాల సేకరణ చేపట్టాడని నిర్ధారణ అయింది. ఈ విషయంపై నర్సింగ్ సూపరింటెండెంట్ నర్సులను వివరణ కోరగా, నర్సుల సమస్యల కోసం అంటూ తమను తప్పుదోవ పట్టించి ఖాళీ పత్రాలపై సంతకాలు సేకరించాడని 60 మంది నర్సులు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సంతకాల సేకరణకు నర్సింగ్ అసోసియేషన్, ఏపీ ఎన్‌జీవో, జీజీహెచ్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ సంఘాల పేర్లు అనధికారికంగా వాడుకున్నాడు. ఆయా సంఘ నాయకులు కూడా శ్రీనివాసరావుపై సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. క్రమశిక్షణ ఉల్లంఘన నేపథ్యంలో నర్సెస్ స్ట్రగుల్ కమిటీ జిల్లా విభాగం నుంచి రాష్ట్ర నాయకత్వం అతనిని బహిష్కరించింది. దీంతో తన సహోద్యోగులైన మహిళా నర్సులపై సామాజిక మాధ్యమాలలో పేర్లు ప్రస్తావించి మరీ తప్పుడు ఆరోపణలు చేశాడు. తాజాగా రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్, సూపరింటెండెంట్, నర్సింగ్ సూపరింటెండెంట్, హెచ్‌వోడీలు ప్రలోభాలకు లొంగి ఉత్తమ సేవా పురస్కారాలకు సిఫార్సు చేశారని తీవ్రమైన ఆరోపణలు చేశాడు. దీనిపై తనకు అవార్డు ఇవ్వలేదన్న అక్కసుతో ఈ పసలేని ఆరోపణలను వాట్సాప్ వేదికగా విస్తృత ప్రచారం చేశాడని ఆసుపత్రి అధికారులు తెలిపారు. అలాగే, సర్జికల్ భవంతిలో విధుల్లో ఉన్న పలువురు పీజీ వైద్యులను కూడా హ్యూమన్ రైట్స్ ప్రతినిధిని అంటూ బెదిరింపులకు గురిచేశాడు. శ్రీనివాసరావు పెట్టిన మెసేజ్‌ల స్క్రీన్ షాట్‌లు, వాయిస్ మెసేజ్‌లను జతచేస్తూ పదుల సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులు కలెక్టర్ వరకు చేరాయి. వరుస ఫిర్యాదులు, మహిళా నర్సులను సామాజిక మాధ్యమాల వేదికగా వేధిస్తున్నాడన్న ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ సీరియస్ అయ్యారు. వాస్తవాలను నిగ్గ తేల్చాలని పేర్కొంటూ కమిటీ ఏర్పాటు చేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో కమిటీ నియామకం జరిగింది. ఈ నెల 15వ తేదీ లోపు విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశాలలో పేర్కొన్నారు.

పథకాల అమలులో అవగాహన అవసరం

హెచ్‌ఎంలతో ఎంఈఓల సమీక్ష

కరప: ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా అమలుచేసే పథకాలపై పూర్తిగా అవగాహన కల్పించుకుని, వాటిని సక్రమంగా నిర్వహించాలని ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ అంశాలపై ఆయన సమీక్షించి అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం అమలు చేయాలని, సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని, విద్యార్థుల హాజరు తగ్గకుండా పర్యవేక్షిస్తుండాలన్నారు. మండల పరిధిలో ఇంత వరకూ 6 స్కూల్ కాంప్లెక్సులు ఉండే వాటిని నాలుగుకు కుదించినట్లు తెలిపారు. కరప, వేళంగి, పెద్దాపురప్పాడు, గురజనాపల్లి కేంద్రాలుగా స్కూల్ కాంప్లెక్స్‌లు ఉంటాయన్నారు. విధి నిర్వహణలో అలసత్వాన్ని విడనాడి, సక్రమంగా నిర్వహించాలని హెచ్‌ఎంలకు సూచించారు.

వయసు వ్యత్యాసంపై ఎంఎల్‌సీ నమోదులో వివాదం

కాకినాడ క్రైం: స్థానిక వన్ టౌన్ పరిధిలో చోటు చేసుకున్న ఓ యువతి ఆత్మహత్య ఘటనపై నమోదు చేసిన మెడికో లీగల్ కేసు(ఎంఎల్‌సీ)పై వివాదం చోటు చేసుకుంది. కాకినాడ జగన్నాథపురానికి చెందిన 20 ఏళ్ల యువతి వ్యక్తిగత కారణాలతో గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెను జీజీహెచ్‌లో చేర్చగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో వైద్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బంధువులు యువతి వయసు 18 ఏళ్లని రాశారు. ఆ వివరాలనే ఆన్‌లైన్ చేశారు. అయితే యువతి వయసు 20 అని, అదే రాసివ్వాలని వన్ టౌన్ పోలీసులు ఎంఎల్‌సీ తీసుకోలేదు. ఈ విషయంపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. గురువారం సాయంత్రం మొదలైన ఈ వివాదం రాత్రి 10 గంటలైనా కొలిక్కి రాలేదు.

ప్రమాదాల నివారణే లక్ష్యం

- జిల్లా రవాణాశాఖ కమిషనర్ శ్రీధర్
- ముగిసిన రహదారి భద్రత మాసోత్సవాలు
- నేడు కాకినాడలో ముగింపు



బాలాజీచెరువు: గత జనవరి 17వ తేదీ నుంచి ప్రారంభమైన జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఈ మేరకు జిల్లా రవాణాశాఖ కమిషనర్ కె.శ్రీధర్ గురువారం తన చాంబర్‌లో మాట్లాడుతూ ప్రధానంగా రహదారి ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఈ మాసోత్సవాలు నిర్వహించామని, పోలీస్, ఆర్అండ్‌బీ, వైద్య, ఆరోగ్యం తదితర శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారన్నారు. జాతీయ రహదారిపై లారీ డ్రైవర్లకు అవగాహన, రాష్ట్ర రహదారులపై బ్లాక్ స్పాట్‌లలో వచ్చే ఏడాదికల్లా ప్రయాణాలు నివారించేందుకు ప్రణాళికలు రూపొందించి రహదారులపై ప్రమాదకర స్పాట్లపై సమీక్ష, విద్యా సంస్థల్లో, అలాగే స్థానిక ప్రజా ప్రతినిధులచే వాక్‌థాన్ నిర్వహించామన్నారు. ద్విచక్ర వాహనచోదకులకు హెల్మెట్ ధారణపై సూచనలు, అంబులెన్స్ డ్రైవర్లకు గుడ్ సమరిటన్ కార్యక్రమంపై అవగాహన కల్పించామన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, వాష్ అండ్ గో పోగ్రాంలో భాగంగా అర్ధరాత్రి వాహనాలు ఆపి ఫేస్ వాష్ చేయించడంతో పాటు టీ సౌకర్యం కల్పించామన్నారు.

నేడు ముగింపు..

కాకినాడ లారీ అసోసియేషన్ హాల్లో నిర్వహించే ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ పాల్గొంటారన్నారు. డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు, ఊపిరితిత్తులు, ఎముకలు, గుండె సంబంధిత వైద్య పరీక్షలతో పాటు, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరునికి పుష్పోత్సవం

కరప: మండలం యండమూరులో వేంచేసిన సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి దివ్యకళ్యాణ వేడుకల్లో భాగంగా గురువారంరాత్రి పుష్పోత్సవం వేడుకగా నిర్వహించారు. స్వామివారి దివ్యకళ్యాణ మహోత్సవం ముగింపు సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించి, ఆలయ మండపంలో ఊయలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పవళింపుసేవ చేశారు.



స్వామి, అమ్మవార్లకు పుష్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

అన్నవరం కాంట్రాక్టర్‌కు జరిమానా

- మొబైల్ డిపాజిట్ కౌంటర్‌లో అదనపు వసూలు
- రూ.20 వేలు చెల్లించాలని వినియోగదారుల కమిషన్ తీర్పు
- కాంట్రాక్టర్‌కు రూ.5 లక్షల భారీ వడ్డన

కాకినాడ లీగల్: అన్నవరం దేవస్థానంలోని సెల్‌ఫోన్ డిపాజిట్ కౌంటర్‌లో అదనపు వసూలు చేసినందుకు వినియోగదారుల కమిషన్ భారీ జరిమానా విధించింది. వివరాలలోకి వెళితే కాకినాడకు చెందిన న్యాయవాది లక్ష్మీనారాయణ గత ఏడాది నవంబర్ 3న అన్నవరంలో తన ఫోన్‌ను డిపాజిట్ కౌంటర్‌లో ఉంచారు. అందుకు రూ.5 చెల్లించాల్సి ఉండగా కౌంటర్ సిబ్బంది ఆయన నుంచి రూ.10 తీసుకున్నారు. దీనిపై ఆయన అక్కడి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కాకినాడ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. తీర్పులో లక్ష్మీనారాయణకు అదనంగా చెల్లించిన రూ.5తో పాటు మానసిక ఒత్తిడికి గురైనందుకు రూ.15 వేలు, కోర్టు ఖర్చులకు రూ.5 వేలు ఇవ్వాలని, అలాగే కాంట్రాక్టరు రూ.5 లక్షల జరిమానాను దేవస్థానానికి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. కాకినాడ వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చెరుకూరి రఘుపతి వసంత్ కుమార్, సభ్యులు చెక్కా సుశీ, చాగంటి నాగేశ్వరరావు ఈ నెల 11వ తేదీన ఈ మేరకు తీర్పు చెప్పారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

కాకినాడ సిటీ: ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నగరపాలక సంస్థ నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కమిషనర్ భావన గురువారం తెలిపారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారు చేపట్టిన ఏడీబీ రోడ్డు పనుల వల్ల సామర్లకోట నుంచి శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు వచ్చే కాకినాడ నగరపాలక సంస్థ నీటి సరఫరా ప్రధాన పైప్‌లైన్‌కు మరమ్మతుల నిమిత్తం ఈ పరిస్థితి ఏర్పడినట్లు ఆమె తెలిపారు. 1500 ఎంఎం లైన్‌పై నాలుగు చోట్ల పైప్‌లను అనుసంధానం చేసి 21వ తేదీ ఉదయం మంచినీటి సరఫరా చేస్తామన్నారు. దీని వల్ల శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్ నుంచి మంచి నీటి సరఫరా అయ్యే రిజర్వాయర్లు శశికాంత్ నగర్, శ్రీవిద్యకాలనీ, భాస్కర్‌నగర్, దుమ్ములపేట, సాంబమూర్తినగర్, ఏజీఎం, శ్రీనివాస బ్యాంకు కాలనీ (గైగోలపాడు), 1 నుంచి 13, 49, 50 వార్డుల పరిధిలో ప్రజలకు ప్రత్యమ్నాయంగా ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతాల ప్రజలు ముందస్తుగా మంచినీటిని నిల్వ చేసుకుని నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు. మంచినీరు అత్యవసరమైతే నీటి సరఫరా ట్యాంకర్ల ద్వారా నీటిని పంపేందుకు 63013 87834, 96767 70461, 73820 42977 నంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడండి

- మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి పిలుపు
- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు శివప్రసన్నకు అభినందనలు



మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడిని కలిసిన వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, జేసీఎస్ కన్వీనర్ విద్యాసాగర్

కాకినాడ: కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అండగా పోరాడాలని మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలిగా మరోసారి నియమితులైన సుంకర శివప్రసన్న గురువారం ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి, మహాలక్ష్మి దంపతులను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా శివప్రసన్నను ద్వారంపూడి అభినందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయకుండా ప్రజలను దగా చేసిందని విమర్శించారు. ప్రజలు కూడా అనేక సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. ఈ స్థితిలో బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వైఎస్సార్ సీపీ ప్రజల పక్షాన నిలిచి పోరాడాలని కోరారు. ప్రజలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్న భరోసాను ఇవ్వాలని పేర్కొన్నారు. పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న మాట్లాడుతూ తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతకు పూర్తిగా న్యాయం చేస్తానని పేర్కొన్నారు. ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యలపై పోరాడతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, పలువురు నాయకులు ఉన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

ట్రెయినీ ఏఎస్పీ సుస్మిత



పండూరు హైస్కూల్‌లో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ట్రెయినీ ఏఎస్పీ సుస్మిత

కాకినాడ రూరల్: విద్యార్థులు క్రమ శిక్షణతో కష్టపడి చదువుకోవాలని ట్రెయినీ ఏఎస్పీ ఆర్.సుస్మిత పేర్కొన్నారు. మండలంలోని పండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె గురువారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వారిని పలు ప్రశ్నలు అడిగి అభ్యసన స్థాయిని అంచనా వేశారు. విద్యార్థులు మంచి అలవాట్లు కలిగి ఉండాలన్నారు. బాలబాలికలు చక్కని హెయిర్ స్టైల్‌తో, శుభ్రమైన యూనిఫాం ఇన్‌షర్ట్ చేసుకుని, షూ పాలిష్ చేసుకుని, సకాలంలో పాఠశాలకు రావాలని సూచించారు. ఆడపిల్లలు బాగా చదివితే తనలా అధికారి కావచ్చని, అందుకోసం కష్టపడి చదువుకోవాలని ప్రేరణ కల్పించారు. ఎస్‌బీఐ సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన కంప్యూటర్, ప్రింటర్, ఇన్వెర్టర్, క్రీడా పరికరాలు, పర్నిచర్‌ను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావు, హెచ్ఎం ఇ.సూర్యప్రకాశిని, ఎంపీవీ సత్యనారాయణ, దుర్గా ప్రసాద్, అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



మహిళకు వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ సరస్వతి

బోట్‌క్లబ్: మహిళలు వారి కుటుంబ సభ్యుల సంరక్షణలో పడి వారి వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించకపోవడంతో అనేక రకాల అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు సరస్వతి అన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 63 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మహిళలు వారి వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపకపోవడంతో రక్తహీనతకు గురవుతున్నారన్నారు. మహిళలు వారు తీసుకునే ఆహారం పట్ల శ్రద్ధ అవసరమన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ఏటా ఫిబ్రవరి 13న ప్రఖ్యాత కవయిత్రి , రాజకీయ మేధావి సరోజినీ నాయుడు జయంతిని జాతీయ మహిళా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చక్రపాణి, శ్రీవల్లి, యేరూష, సిరాజ్, జగదీష్ పాల్గొన్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు



గంజాయితో రమణయ్యపేటలో పట్టుబడిన నిందితులతో సర్పవరం పోలీసులు

కాకినాడ రూరల్: కాకినాడ, పరిసర ప్రాంతాలలో గంజాయి విక్రయాలు జరిపేందుకు గాను గంజాయితో రమణయ్యపేట పరిసరాలలో సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను రమణయ్యపేట డ్రైనేజీ కాలువ బండ వద్ద సర్పవరం పోలీసులు గురువారం ఉదయం అరెస్ట్ చేశారు. సీఐ పెద్దిరాజు వివరాల ప్రకారం రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో దండుపుంతకు చెందిన వలస గిరిధర్, ఏపీ ఎస్పీ ఎదురుగా ఉన్న ప్రాంతానికి చెందిన మీసాల వివేక్, మరో బాలుడు కలిసి 6 కిలోల 200గ్రాముల గంజాయితో పట్టుబడ్డారన్నారు. నిందితులు గంజాయి, సిగరెట్లు, మద్యం వంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారి అల్లూరి సీతారామరాజు జిల్లా ధారకొండ తదితర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి కాకినాడలో అధిక ధరకు విక్రయించేందుకు ప్రణాళిక వేశారన్నారు. జిల్లా ఎస్పీ బి.బిందుమాధవ్ ఆదేశాల మేరకు తాము చేపట్టి ఆపరేషన్‌లో నిందితులు పట్టుబడ్డారన్నారు. నిందితులను పట్టుకోవడంలో ఎస్సై శ్రీనివాస్‌కుమార్, సిబ్బంది కృషి అభినందనీయమన్నారు.

ఆంకాలజీ విభాగం ఏర్పాటుకు స్థల పరిశీలన



క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాట్లుకు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: కాకినాడలో నూతనంగా నిర్మించనున్న క్యాన్సర్ ఆసుపత్రి ఆంకాలజీ విభాగం ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను కలెక్టర్ షణ్మోహన్ గురువారం పరిశీలించారు. కలెక్టరేట్ ఆవరణ పక్కన ఉన్న మున్సిపల్ అతిథి గృహ స్థలాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఏపీఎంఎస్ఐడీసీ ఇతర ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం కాకినాడ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో నిర్మించిన 500 పడకల నూతన సమీకృత ఆయుర్వేద ఆసుపత్రిని ఆయన ఆయుష్ వైద్య అధికారులు, ఏపీఎంఎస్ ఐడీసీ, జీపీటీ కళాశాల సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ సీహెచ్ రత్నరాజు, డీఈ ఎస్ఎస్ చక్రవర్తి, ఆయుష్ వైద్య అధికారులు మహమ్మద్ షాజన్ అలీ, కె శ్రీనివాసు, జీపీటీ ఇన్‌చార్జి మున్సిపల్ సంజయ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు వేగవంతం చేయండి

- డీఆర్వో వెంకటరావు
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష



సమీక్షలో అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరావు

కాకినాడ సిటీ: జిల్లాలో ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి ఆధార్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. 0–5 ఏళ్ల వయసు గల పిల్లల ఆధార్ నమోదు, పిల్లల బయో అప్‌డేట్ చేయడం, తల్లిదండ్రుల అప్‌డేట్ చేసిన పిల్లల జనన ధ్రువీకరణ పత్రాల నమోదు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆధార్ సంఖ్య నమోదు, గ్రామ, వార్డు సచివాలయం, పోస్ట్ ఆఫీస్ ఇతర కార్యాలయాల్లో జరుగుతున్న ఆధార్ నమోదుల వంటి అంశాలపై డీఆర్వో వెంకటరావు చర్చించారు. 0–5 సంవత్సరాల వయసు గల పిల్లలకు సంబంధించి 70 వేల మందికి ఆధార్ నమోదు చేయాల్సి ఉందన్నారు. చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టి వేగవంతం చేయాలన్నారు. డీ–యాక్టివేషన్ నివారించడానికి పిల్లల అందరి బయో అప్‌డేట్‌ను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారులందరికీ ఆధార్ సంఖ్య నమోదు చేయాలన్నారు. ఇందుకు ఆయా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని డీఆర్వో తెలిపారు. అదే విధంగా 15 నుంచి 17 ఏళ్ల వయస్సులో గల వారి బయోమెట్రిక్ పెండింగ్ లేకుండా చూడాలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లాలో మొత్తం 97 ఆధార్ కిట్లకు గాను 82 ఆధార్ కిట్లు వివిధ మండలాల్లో పని చేస్తున్నాయన్నారు. మిగిలిన 15 సాంకేతిక లోపంతో వినియోగించడం లేదన్నారు. అదే విధంగా ప్రతి ఆధార్ కేంద్రంలో వివిధ సేవలకు సంబంధించి వసూలు చేసే ధరల వివరాలతో కూడిన పోస్టర్లను కేంద్రాల వద్ద ప్రదర్శించాలని డీఆర్వో అధికారులకు సూచించారు. సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, శ్రీరమణి, జిల్లా ఆధార్ మేనేజర్ జి.గిరిధర్, గ్రామ, వార్డు సచివాలయ సమన్వయ కర్త జె.శంకర్, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్, డీపీవో వి.రవికుమార్, పోస్టల్ పీఆర్ఐసీ కె.ప్రసాదరావు, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు, అధికారులు పాల్గొన్నారు.